# మద్యం మత్తులోనే దాడి...

## సింగ్ నగర్‌లో యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

**విజయవాడ, మే 14 (ప్రభాతవార్త) :** ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ అజిత్ సింగ్ నగర్, పోలీస్ స్టేషన్ పరిధిలో యువకుడి హత్య కేసు నిందితులను పోలీసులు 24 గంటల్లోనే అరెస్టు చేయడం పట్ల హర్షం వ్యక్తమవుతోంది. స్నేహితుల మధ్య క్షణికావేశంలో ఈ హత్య జరిగినట్లు డిసిపి గుణ్ణం రామకృష్ణ పేర్కొన్నారు. మీసాల కుమార్ (36) అనే వ్యక్తిని రాజరాజేశ్వరిపేటలో ఈనెల 12న రాత్రి తలపై బలంగా కొట్టి చంపి హత్య చేసిన విషయం విదితమే. ఈ విషయంలో పోలీసులు తక్షణం స్పందించి నిందితులైన నిందితులైన పంది ప్రసాద్ (24), మండల ఏసు అలియాస్ చిన్న కొత్తెం (30), గద్దల ప్రశాంత్ (39) లను 24 గంటల్లోపే అరెస్టు చేశారు. మృతుడు మీసాల కుమార్ అలియాస్ గంజికుమార్ ఐదేళ్ళ క్రితం మోనిక అనే యువతితో వివాహం అయ్యింది. కుమార్ మద్యానికి బానిస కావడంతో తరచూ భార్య భర్తల మధ్య గొడవలు జరుగుతూ ఉండేవి. ఈ క్రమంలో ఈ నెల 11న కుమార్ భార్యతో గొడవపడి కొత్త రాజేరాజేశ్వరిపేటలోని తన స్నేహితుడు పంది ప్రసాద్ కె.జి.ఎఫ్. అపార్టుమెంటు వద్దకు వచ్చి ఉన్నాడు. ఈ సమయంలో కుమార్ పంది ప్రసాద్ తల్లి గురించి అనుచితంగా మాట్లాడటంతో ఇద్దరి మధ్య తీవ్ర వ్యాగ్యుద్ధం జరిగింది. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న పంది ప్రసాద్ 12 వతేదీ రాత్రి ఇద్దరూ మద్యం సేవించిన సమయంలో దాడి చేయాలనినిర్ణయించుకుని, అతడితో గొడవపడి నాపరాయితో తలపై బలంగా కొట్టడంతో కుమార్ అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు తెలిపారు. పంది ప్రసాద్ అక్కడి నుంచి ఆటోలో పరారై వై.ఎస్.ఆర్. జక్కంపూడి కాలనీలోని మండల ఏసు ఇంటి వద్దకు అక్కడే ఉన్న గద్దల ప్రశాంత్ కు చెప్పాడని తెలిపారు. రక్తం మరకలు ఉన్న దుస్తులను వీరు ఒక సంచిలో దాచి, ఆటోలో ఉన్న రక్తపు మరకలను ముగ్గురూ కలిసి కడిగారు. హత్య విషయమై సమాచారం అందుకున్న అజిత్ సింగ్ నగర్ సిఐ దాడి చంద్రశేఖర్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి కమిషనర్ రాజశేఖర్ నేతృత్వంలో డిసిపి గుణ్ణం రామకృష్ణ, నార్త్ డివిజన్ ఎసిపి పి.సత్యానందం కేసును విచారించి నిందితులను పట్టుకున్నారు.

## తుది శ్వాసవరకు ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి కొరివి రామారావు




**ఎ కొండూరు, మే 14, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం గొల్లమండల గ్రామానికి చెందిన మాజీ ఎంపిపి కొరివి వీర వెంకట రామారావు (కెవివి రామారావు) తుదిశ్వాసవరకు ప్రజాసేవకే తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప ప్రజా సేవకుడు రామారావు అని విజయవాడ మాజీ ఎంపిపి కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. గొల్లమండల గ్రామంలో ఇటీవల మృతి చెందిన కొరివి రామారావు స్వగృహానికి వెళ్లి కుటుంబ సభ్యుల మాజీ ఎంపి కేశినేని నాని పరామర్శించి ప్రగాఢ సంతాపాన్ని కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా కేశినేని నాని మాట్లాడుతూ తాను విజయవాడ ఎంపిగా ఉన్న సమయంలో గొల్లమండల గ్రామాన్ని పార్లమెంటరీ నియోజకవర్గంలో దత్తత తీసుకునే విధంగా కృషి చేసి కోట్లాది రూపాయల నిధులతో గొల్లమండల గ్రామంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు రహదార్లు సిసిరోడ్లు విద్యుత్ తాగునీరు లాంటి మౌలిక వసతుల కల్పనకు శక్తి వంచన లేకుండా కృషి చేసిన మహోన్నత వ్యక్తిత్వం గల ప్రజా సేవకుడు రామారావు అని కేశినేని నాని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వివిధ పార్టీల నాయకులు, గ్రామంలో సీనియర్ సిటీజన్లు ప్రజలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విజయవాడ వార్త





## రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు 3.5 లక్షల మంది అన్న క్యాంటీన్‌లో ఆహారం తీసుకుంటున్నారు : మంత్రి నారాయణ

**విజయవాడ కార్పొరేషన్,మే 14,ప్రభాతవార్త :** అన్న క్యాంటీన్‌లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి రోజు సుమారు 3.5 లక్షల



మంది అన్న క్యాంటీన్‌లో ఆహారం తీసుకుంటున్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు.గురువారం రాణీగారితోట,సాయిబాబా గుడి సమీపం లోని అన్న క్యాంటీన్‌ను ఆయన కమీషనర్ ధ్యానచంద్రతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఉన్న సదుపాయాలు,ఆహార నాణ్యత,పరిశుభ్రత,తాగునీటి ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ముఖ్యంగా ప్లేట్లు శుభ్రపరుస్తున్న విధానం,ఆహారం వడ్డించే ప్రాంతాల్లో పరిశుభ్రతా ప్రమాణాలను తనిఖీ చేశారు. అలాగే క్యాంటీన్‌లో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్,కూలర్లు,దోమతెరలు,ప్రత్యేక పార్కింగ్ సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం మంత్రి నారాయణ,కమీషనర్ ధ్యానచంద్రలు రూ.5 చెల్లించి టోకెన్లు తీసుకొని అందరితో కలిసి క్యాంటీన్‌లో భోజనం చేశారు. భోజనం చేస్తున్న ప్రజలతో మాట్లాడి,వారికి అందుతున్న ఆహారం నాణ్యతపై అభిప్రాయాలను తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో ఆహారం పరిశుభ్రమైన వాతావరణంలో ఎంతో రుచికరంగా అందిస్తున్నారని తెలిపారు. పేదవారికి నాణ్యమైన ఆహారం అందించాలన్నదే సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆశయమన్నారు. అన్న క్యాంటీన్లను కొనసాగించమని ప్రజలు ఎంత కోరినా గత ప్రభుత్వం వాటిని మూసివేసిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని అన్న క్యాంటీన్లను సమర్థవంతంగా నిర్వహిస్తోందని తెలిపారు. వారంలో ఒకరోజు మున్సిపల్ కమీషనర్లు అన్న క్యాంటీన్‌లలో భోజనం చేసి ఆహార నాణ్యతను పరిశీలించాలని ఆదేశాలు జారీ చేసామన్నారు. ఇటీవల గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొత్తగా అన్న క్యాంటీన్లు ప్రారంభించామని తెలిపారు.

## క్రీడా సంస్కృతితో ఆరోగ్యవంతమైన సమాజం

**విజయవాడ తూర్పు, మే 14 (ప్రభాతవార్త) :** ఎన్టీఆర్ జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 50 సమ్మర్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కోచింగ్ క్యాంపులు జరుగుతుండగా ఇందులో భాగంగా గురువారం నగరంలోని ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో జరుగుతున్న క్రీడల శిబిరాన్ని కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. చిన్నారులతో కలిసి ఆటలాడి వారిని ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ పిల్లల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడంలో ఇటువంటి శిక్షణ శిబిరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా, క్రమశిక్షణ, జట్టు భావన, ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయని అన్నారు. చిన్నారులు, యువత మొబైల్ ఫోన్లు, టీవీలకు పరిమితం కాకుండా క్రీడల వైపు కూడా అడుగులు వేయాలని సూచించారు. వేసవి సెలవులను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని క్రీడల్లో నైపుణ్యాలను పెంపొందించుకోవాలనే ఉద్దేశంలో ఈ నెల 31వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా 27 క్రీడా విభాగాల్లో కోచింగ్ క్యాంపులు ఉదయం, సాయంత్రం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. క్రీడా సంస్కృతి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఉపయోగపడుతుందని, క్రీడలను ప్రతిఒక్కరూ తమ జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి (డీఎస్‌డీవో) కె.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## ఈనెల18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవ వేడుక

**విజయవాడ, మే 14 (ప్రభాతవార్త) :** ఈ నెల 18న అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం సందర్భంగా పండగలా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పర్యాటక,




ఆర్కియాలజీ శాఖలతో పాటు జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో విజయవాడ ఉత్సవ్ కమిటీ భాగస్వామ్యంతో ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. గురువారం కలెక్టరేట్ శ్రీ ఏపీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. వారసత్వ సంపదను సంరక్షిస్తూ సంస్కృతిని సజీవంగా నిలిపే జ్ఞాన నిలయాలే మ్యూజియాలని, గత వైభవాన్ని నేటి తరానికి, నేటి సంస్కృతిని రేపటి తరానికి అనుసంధానించే వారధులని పేర్కొన్నారు. ఇంతటి విశిష్టత కలిగిన మ్యూజియంల చారిత్రక వారసత్వ ప్రతీకలను భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మ్యూజియమ్స్ యునైటింగ్ ఏ డివైడెడ్ వరల్డ్ థీమ్‌తో ఈ ఏడాది అంతర్జాతీయ మ్యూజియం దినోత్సవం జరుగుతుందన్నారు. 1887లో పునాది పడిన మన నగరంలోని బాపూ మ్యూజియాన్ని ఈ నెల 18న ఉచితంగా సందర్శించి, కార్యక్రమాల్లో భాగస్వాములు కావొచ్చన్నారు. రాష్ట్రంలో 14 వరకు పురావస్తు మ్యూజియాలు, మ్యూజియం క్షేత్రాలు ఉన్నాయని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

**బాపూ మ్యూజియంలో రోజంతా ప్రత్యేకం**

ఈ నెల 18న ఉదయం బాపూ మ్యూజియంలో కల్చరల్ ఓపెనింగ్‌తో ప్రారంభమై మ్యూజియమ్స్ ఇన్ ది మోడర్న్ డే పై ప్రత్యేక చర్చలు, గైడెడ్ మ్యూజియం టూర్, విజయవాడ హెరిటేజ్ క్విజ్, దేశభక్తిని పెంపొందించేలా మ్యూజియంల విశిష్టతను చాటిచెప్పేలా లేజర్ షో వంటి కార్యక్రమాలు ఉంటాయన్నారు. హెరిటేజ్ ఫొటోగ్రఫీ హంట్, పెయింటింగ్ పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతుల ప్రదానంతో పాటు సత్కరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానంలో జరిగే రూట్స్ రీలోడెడ్ కార్యక్రమంలో భాగంగా ప్రముఖ గాయని గీతా మాధురి బృందంతో పాటు బ్యాండ్ సెహారీ లైవ్ మ్యూజికల్ కాన్సర్ట్ ఉంటుందని వెల్లడించారు. అనుభవజ్ఞులు, యువత, విద్యార్థులు, వివిధ సంస్థలు, జర్నలిస్టులు ఇలా ప్రతిఒక్కరూ కార్యక్రమాల్లో భాగస్వాములై విజయవంతం చేయాలని, గౌరవ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు కూడా ఈ కార్యక్రమాల్లో పాల్గొంటారని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, ఆర్కియాలజీ డీడీ ఎం.రామసుబ్బారెడ్డి, ఏడీలు వెంకటరావు, నరసింహానాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధి వీఎం సుధర్మ తదితరులు పాల్గొన్నారు.

## నగర పారిశుద్ధ్య పనుల్లో మరింత వేగం : ఎంపి కేశినేని శివనాథ్

### సింగ్‌నగర్ గార్బేజ్ స్టేషన్‌లో 5 జెసిబి వాహనాలు ప్రారంభం

**విజయవాడ కార్పొరేషన్,మే 14,ప్రభాతవార్త :** సెంట్రల్ నియోజక వర్గం లోని గార్బేజ్ స్టేషన్ లోకి జెసిబి వాహనాలను ప్రారంభించడం ఆనందదాయకమని వీటి వలన నగర పారిశుధ్య పనుల్లో మరింత వేగం



పెరుగుతుందని ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) పేర్కొన్నారు. నగర పారిశుద్ధ్య నిర్వహణను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అజిత్‌సింగ్‌నగర్ గార్బేజ్ ట్రాన్స్ ఫర్ స్టేషన్‌లో నగరపాలక సంస్థ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 జెసిబి వాహనాలను గురువారం ఆయనతో పాటు సెంట్రల్ నియోజక వర్గ శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. విజయవాడ నగరంలో పారిశుద్ధ్య,డ్రైనేజి,ఘన వ్యర్థాల నిర్వహణ పనులను మరింత వేగవంతం చేయడానికి 74 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన 5 బ్యాక్‌హో లోడర్ జెసిబి వాహనాలను రూ.2.22 కోట్ల వ్యయంతో సమకూర్చినట్లు అధికారులు ఈ సందర్భంగా తెలిపారు. ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ సెంట్రల్ నియోజక వర్గంలోని గార్బేజ్ ట్రాన్స్ఫర్ స్టేషన్‌లో 5 జెసిబి వాహనాలను ప్రారంభించడం ఆనందదాయకమన్నారు. గతంలో ఈ ప్రాంత ప్రజలు చెత్త డ్రైనేజి సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడేవారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంఎల్ఏ బోండా ఉమామహేశ్వరరావు నియోజక వర్గ అభివృద్ధికి విశేష చేస్తున్నారని తెలిపారు. నేడు ఈ ప్రాంత అభివృద్ధికి ఎంఎల్ఏ బోండా ఉమా ప్రధాన కారణమని చెప్పడంలో అతిశయోక్తి లేదన్నారు. డ్రైనేజీలు,రోడ్లు,సుందరీకరణ పనులతో ప్రాంత రూపురేఖలు మారుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో విజయవాడ సెంట్రల్ నియోజక వర్గంలో చిన్న చిన్న పనులు కూడా జరగలేదని విమర్శించారు. గ్రేటర్ విజయవాడ అభివృద్ధి లక్ష్యంగా ఎంఎల్ఏతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళా_ముని తెలిపారు. ఎంఎల్ఏ బోండా ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ నిరంతరం కేంద్రం నుండి నిధులు తీసుకువస్తూ నగరాభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రధానమంత్రి ముఖ్యమంత్రి ప్రతి నెల నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రత్యేక దృష్టి సారించడం వల్ల పారిశుద్ధ నిర్వహణలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. గతంలో ఈ ప్రాతం చెత్త చెదారం,దుర్వాసనతో ప్రజలకు ఇబ్బందికరంగా ఉండేదని, టిడిపి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తర్వాత చెత్త నుండి సంపద సృష్టించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. విజయవాడ నగరంలో జరుగుతున్న అభివృద్ధిపనులు ఎంపీ కేశినేని శివనాథ్ కృషికి నిదర్శనమన్నారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ చీఫ్ ఇంజనీర్ ఇంఛార్జి పి.సత్యకుమారి,పర్యవేక్షణ ఇంజనీర్ (వర్క్స్)చంద్రశేఖర్, అధికారులు,ఇంజనీరింగ్ సిబ్బంది,పారిశుధ్య విభాగం అధికారులు,స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల సంక్షేమం పై బురద చల్లొద్దు

**పెనమలూరు మే 14 ప్రభాతవార్త :** మత్స్యకారుల సంక్షేమం కూటమి ప్రభుత్వ కృషి అని ఔట్సోర్సింగ్ నియామకాల్లో అవినీతి లేదని మత్స్యకారుల సంక్షేమంపై అనవసరంగా బురద జల్లుతున్నారని మత్స్యశాఖ నియామకాలపై వచ్చిన కథనాన్ని ఫిషర్మెన్ కో ఆపరేటివ్ ఫెడరేషన్ సొసైటీ మత్స్య శాఖ చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు గురువారం కృష్ణాజిల్లా పెనమలూరు



మండలం పోరంకి లోని మత్స్యశాఖ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలన ఒక ఎత్తు అయితే ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులపై బురద చల్లడం మరో ఎత్తు అని విమర్శించారు రాష్ట్రంలో మత్స్యకార సొసైటీలను బలోపేతం చేసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పథకంలో భాగంగా 48 మంది సభ్యులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమించుకున్నామని తెలిపారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు నెలకు రూ 37, 800 జీతం చెల్లిస్తున్నప్పుడు వారి వద్ద ఐదు లక్షల లంచం తీసుకున్నారు అని ఆరోపణలు హాస్యాస్పదమని తెలిపారు. కూటమి ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తుందని ఆయన తెలిపారు. చెరువులు రిజర్వాయర్లలో ఉచితంగా చేప పిల్లల పంపిణీ, బోట్లు, వలలపై 75 సబ్సిడీ 50 ఏళ్లకే మత్స్యకారులకు పెన్షన్ వంటి పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. పోరంకి ఫిషరీస్ కమిషనర్ కార్యాలయంలో ఆఫ్ కాఫ్ చైర్మన్ రామప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందాలనే సంకల్పంతో ముందుకు వెళ్తుంటే మాపై అసత్య ఆరోపణలు చేస్తూ వార్తలు ప్రచురించడం నీచంగా భావిస్తున్నామని అసహనం వ్యక్తం చేశారు మత్స్యకారుల సంక్షేమం కూటమి ప్రభుత్వం కృషి అని గతంలో ఎన్నడూ లేని విధంగా మత్స్యకారులకు మేలు జరిగిందంటే అది ముఖ్యమంత్రి సహకారమే అని సూచించారు మత్స్య శాఖ మంత్రి అచ్చం నాయుడు కొల్లు రవీంద్ర సహకారంతో మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని తెలిపారు. మత్స్యశాఖ కార్యాలయ ఉద్యోగుల నియామకాలపై వివరణ ఇస్తూ రాష్ట్రంలో 120 కి పైగా సొసైటీలను ఎఫ్పి ఓ లుగా మార్చడం జరిగిందన్నారు వీటికి సంబంధించి మేనేజ్మెంట్ కోసం ఒక టీంను ఏర్పాటు చేయడానికి నోటిఫికేషన్ ఇచ్చామని నియామక ప్రక్రియ వందల మంది దరఖాస్తు చేసుకోగా అర్హులను ఎంపిక చేసి ఇంటర్వ్యూలు నిర్వహించి వీరికి 11 నెలల ఔట్సోర్సింగ్ ఒప్పందంపై మాత్రమే వారిని నియమించామని తెలిపారు.

## సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌కు పూర్తిగా చెక్ పెట్టాలి : కలెక్టర్ లక్ష్మీశ

**విజయవాడ కార్పొరేషన్,మే 14,ప్రభాతవార్త:** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణంతో పాటు ప్రజల ఆరోగ్యానికి కూడా తీవ్ర ముప్పు వాటిల్లే అవకాశముందని కావున ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని పూర్తిగా మానేసి పర్యావరణమితమైన గుడ్డ సంచులను ఉపయోగించాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్,విజయవాడ నగరపాలక సంస్థ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. గురువారం ఉదయం నిర్వహించిన నగర పర్యటనలో భాగంగా చిట్టినగర్,కొత్తపేట ప్రాంతాలను కలెక్టర్ విస్తృతంగా పర్యటించి క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహజంచారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్యం సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధ అమలుపై ప్రజల్లో అవగాహన కల్పించారు. పర్యటనలో భాగంగా కొండ ప్రాంతాల్లో ఒక దుకాణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న విషయాన్ని గమనించి వెంటనే వ్యాపారులతో మాట్లాడి ప్లాస్టిక్ కవర్ల వినియోగం పూర్తిగా నిషేధమని స్పష్టం చేశారు. దుకాణాలకు వచ్చే వినియోగదారులకు గుడ్డ సంచులు తీసుకొచ్చేలా ప్రోత్సహించాలని వ్యాపారులకు సూచించారు. అదేవిధంగా షాపుకు వచ్చిన ఒక వ్యక్తి చేతిలో ఉన్న ప్లాస్టిక్ కవరును స్వయంగా తీసుకొని తన వద్ద ఉన్న గుడ్డ సంచిని అందచేసి ప్రజల్లో అవగాహన కల్పించారు. పర్యావరణ పరిరక్షణ త్రపి ఒక్కరి భాధ్యత అని, గుడ్డ సంచులు వంటి పర్యావరణ హిత మార్గాల ద్వారా ప్లాస్టిక్ కాలుష్యాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ ఓటింగ్ ప్రక్రియలో ప్రతి పౌరుడు తప్పనిసరిగా పాల్గొనాలని



కోరారు. ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి స్వయంగా క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి వారి అభిప్రాయాలను నమోదు చేయించారు. విజయవాడ నగర పరిశుభ్రతపై తమ అభిప్రాయాలను స్వచ్ఛ సర్వేక్షణ్ ఫీడ్‌బ్యాక్ ద్వారా తెలియచేయాలని జాతీయ స్థాయి ర్యాంకుల్లో విజయవాడను ఉత్తమ స్థానంలో నిలిపేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్,అసిస్టెంట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్నపూర్ణ తదితర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మండల కేంద్రంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం..

### స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర ప్రచార ఆర్భాటం

**ఎ కొండూరు, మే 14, ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛాంధ్ర స్వర్ణాంధ్ర అంటూ ప్రచార ఆర్భాటం తప్ప ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం మండల కేంద్రమైన ఎ కొండూరులో ఈ స్వర్ణాంధ్ర స్వచ్ఛాంధ్ర కార్యక్రమం మచ్చుకైనా కానరావడం లేదని



ప్రజలు ఆవేదన చెందుతున్నారు. మండల కేంద్రంలోని ఎ కొండూరు ప్రధాన రహదారి (ఇండియన్ బ్యాంక్) పాత కొండూరు వెళ్లే రహదారి అలాగే వంట శ్రీను పక్కన రోడ్డు ఇంకా యాదవ బజార్ రహదార్లు వీటికి డ్రైన్ల సౌకర్యం లేక మురుగు నీరు పారుదల లేక పూడికతీత పనులు నిర్వహించకపోవడంతో ఈ రహదారుల్లో డ్రైన్లు దుర్గంధం వెదజల్లుతుండడంతో లార్వాలతో నెలవుగా మార డంతో ప్రజలు అంటువ్యాధులు సోకుతాయని భయాందోళన చెందుతున్నారు. ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం ఎక్కడా నిర్వహించడం లేదని ప్రజలు గ్రామ పంచాయతీ అధికారుల తీరును విమర్శించారు.




గ్రామ పంచాయతీ సర్పంచ్ పాలకుల పదవీ కాలం ఫిబ్రవరి నెలలో ముగియడం ప్రత్యేక అధికారుల పాలన తిరువూరు నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా పశు సంవర్ధక శాఖ జెసిని నియమించడం వీరి పర్యవేక్షణ లేకపోవడంతో పారిశుధ్యం పేరుకుపోయి మండల కేంద్రంలో ప్రజలు మురుగు కాల్వల ఆవాసాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. ఇకనైనా ఈ మండల కేంద్రంలోని ఎ కొండూరులో డ్రైన్ ఇంకా ఇతర పారిశుధ్యం చర్యలు బ్లీచింగ్ సున్నం దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించి ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కలెక్టర్ డిపివో డిఎల్‌పివో డిఎం అండ్ హెచ్‌వోకు విజ్ఞప్తి చేశారు.

## వంద రూపాయల టిడిపి సభ్యత్వం

### మృతుని కుటుంబానికి ఐదు లక్షల భరోసా....

**కంచికచర్ల మే 14 ప్రభాతవార్త :** కంచికచర్ల మండల పరిధిలోని కీసర గ్రామానికి చెందిన రాచబండి లక్ష్మీనారాయణ రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆయన తెలుగుదేశం పార్టీ సభ్యత్వాన్ని రూ.100 తో తీసుకున్న నేపథ్యంలో పార్టీ ఇన్సూరెన్స్ పతకం ద్వారా ఆయన కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ సందర్భంగా మృతుడి సతీమణి రాచబంటి విజయలక్ష్మికి ఆర్థిక సహాయం మంజూరు పత్రాన్ని తెదపా నేతలతో కలిసి ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని తెలిపారు. కేవలం రూ.100 సభ్యత్వం తోనే వారి కుటుంబాలకు 5 లక్షల ఆర్థిక భరోసా కల్పించడం పార్టీ కార్యకర్తల పట్ల ఉన్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.



ప్రమాదవశాత్తు కుటుంబ పెద్దను కోల్పోయిన కుటుంబాలకు ఇలాంటి ఇన్సూరెన్స్ పథకాలు ఎంతో ఊరట నిస్తాయని, కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ ఎప్పటికి అండగా ఉంటుందని ఆమె హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోగంటి వెంకట సత్యనారాయణ స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు మరియు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## అమేజాన్ ఈవి రెడీ సరుకు రవాణా నెట్‌వర్క్ ఏర్పాటు

**విజయవాడ, మే 14, ప్రభాతవార్త :** ది క్లైమెట్ ప్లేడ్జ్. సి 40 సిటీస్ సహకారంతో భారతదేశంలో సరుకు రవాణా రహదారులు విద్యుదీకరించేందుకు నేషనల్ ఇవి హైవే గైడెన్స్ ఫ్రేంవర్క్ విడుదల చేసినట్లు అమేజాన్ ఇండియా ప్రతినిధులు తెలిపారు. 2035 నాటికి దేశవ్యాప్తంగా ఈవి రెడీ సరుకు రవాణా నెట్వర్క్ ఏర్పాటు లక్ష్యమన్నారు.

